
కరీంనగర్: మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



## మా వాటా సాగునీరు రానివ్వకపోతే
# కాలువ గేట్లు పగులగొడుతం

- న్యాయబద్ధంగా నీటిని పంపిణీ చేయాల్సిందే • లేదంటే రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం • అధికారులు సమన్యాయం పాటించాలి
- నిధుల కేటాయింపులో జిల్లాపై వివక్ష • ఈసారి బడ్జెట్‌లో వచ్చింది సున్న
- నగరంలో అభివృద్ధి నిలిచింది • బీసీలకు అన్యాయం జరిగింది
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 20 : అన్ని ప్రాంతాలకు రైతులకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నీటిని అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలున్న చోటకు తరలించకపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భగ్గుమన్నారు. ఈ వ్యవస్థ ఇలాగే కొనసాగితే ఊరుకునేది లేదని, తమ ప్రాంత రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే కాకతీయ కాలువ హెడ్‌రెగ్యులర్‌ను పగులగొట్టయినా సరే పంటలు కాపాడుతామని, అందుకు వెనకాడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ సాగునీటి పంపిణీలో జరుగుతున్న అన్యాయంపై మండిపడ్డారు. కాకతీయ కాలువ 116 కిలోమీటర్‌వద్ద ఉన్న హెడ్‌రెగ్యులర్‌ను కిందకి దింపి.. డీ 89 కాలువ ద్వారా నీళ్లు రాకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహించారు. దీని వల్ల కరీంనగర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు నీళ్లు రాక పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇదే నీటిని దిగువకు అంటే.. అధికార పార్టీ మంత్రి, ఎమ్మెల్యేలున్న చోటకు పంపిస్తున్నారని, ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని భగ్గుమన్నారు. ఇక ముందు వచ్చే నీటి విషయంలో సమన్యాయం పాటించకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయని, అధికారులు శాశ్వతంగా ఉంటారన్నారు. కానీ, అధికారులే నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే తర్వాత జరిగే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అధికారుల వల్లే అనేక గ్రామాల్లో పంటలు ఎండిపోయే దుస్థితి వచ్చిందన్నారు. తనకు పోరాటాలు కొత్త కాదని, సమైక్య రాష్ట్రంలోనే తన నియోజకర్గానికి అన్యాయం జరిగితే.. తాగు, సాగునీటి కోసం పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వీటిన్నంటినీ దృష్టిలో పెట్టుకొని అధికారులు సమన్యాయం పాటించాలని సూచించారు.

### బడ్జెట్‌లో జిల్లాకు గుండు సున్నా?

జిల్లాలో అధికార పార్టీ ఉన్నదా.. లేదా..? అన్న అనుమానాలు వస్తున్నాయని గంగుల విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి బీఆర్ఎస్ పాలనలో ప్రవేశపెట్టిన ప్రతి రాష్ట్ర బడ్జెట్‌లో కరీంనగర్ జిల్లా పేరుతో నిధులు కేటాయింపు జరిగిందని, కానీ, తాజా బడ్జెట్‌లో ఏం కేటాయింపులు జరిగియో ఒకసారి గమనించాలని కోరారు. కరీంనగర్ రాష్ట్రంలో ఒక భాగం కాదా..? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉంటే నిధులు రావా..? అని నిలదీశారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తే కరీంనగర్‌కు ఒక్కటి కూడా ఇవ్వలేదని, గంగుల కమలాకర్ ఎమ్మెల్యేగా ఉంటే మంజూరు చేయారా..? అని అడిగారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో కరీంనగరానికి సీఎం అస్యూరెన్స్ కింద ₹350 కోట్లు తెచ్చి అభివృద్ధి చేశామని, 2023 డిసెంబర్ వరకు ఈ పనులు కొనసాగాయని వివరించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 14 నెలల నుంచి పనులు ఎక్కడివక్కడే ఆగిపోయాయన్నారు. నిధులు తేవడం చేతకాకపోయినా సరే కనీసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ₹350 కోట్లతో మిగిలిన పోయిన పనులను యుద్ధప్రాతిపదిక పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అద్భుతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగిన కరీంనగర్‌ను.. కాంగ్రెస్ పాలనలో వెనకపడేసిన మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. వైఎస్సార్ హయాంలో మినీ కళాభారతికి శంకుస్థాపన చేసి వదిలేస్తే.. దానిని తన హయాంలో రద్దు చేయకుండా అదనంగా ₹13.50 కోట్లు మంజూరు చేయించి అమృతవర్షిణి పేరుతో పనులు చేపట్టామని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ పనులను సైతం పక్కన పడేస్తారని మండిపడ్డారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు తెరుచుకోని, వీధిదీపాలు వెలగని పరిస్థితి ప్రస్తుతం కరీంనగర్‌లో ఉందన్నారు.

### మానేరు రివర్‌ఫ్రంట్‌పై ఎందుకీ వివక్ష

దక్షిణ భారత దేశంలోనే కరీంనగర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన మానేరురివర్ ఫ్రంట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఎమ్మెల్యే మండిపడ్డారు. తాజా బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించకపోవడమే అందుకు నిదర్శనమన్నారు. 2021 జీవో నంబర్ 215 ద్వారా మానేరు రివర్ ఫ్రంట్‌కు ₹310 కోట్ల నిధులు తెచ్చి పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. మళ్లీ ఇరిగేషన్, మున్సిపల్ శాఖల నుంచి ₹214 కోట్లతోపాటు మరో ₹వంద కోట్లు కూడా మున్సిపల్ శాఖ ద్వారా విడుదల చేయించి పనులు చేపట్టామని చెప్పారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి.. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నదని ప్రశ్నించారు. ఇప్పటికైనా వివక్షను పక్కన పెట్టి రివర్ ఫ్రంట్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

### తేరుకోకపోతే తాగునీటికి తండ్లాటే

ఎల్ఎండీలో ప్రస్తుతం ఎనిమిది టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నెలాఖరు వరకు సాగు కోసం 3.5 టీఎంసీ నీటి విడుదల చేస్తున్నారని గంగుల చెప్పారు. డెడ్ స్టోరేజీ పోతే.. మిగిలిన నీటితో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో యుద్ధ ప్రాతిపదికన అధికారులతో సమీక్షించి, మధ్యమానేరు నుంచి నీటిని విడుదల చేసి, స్టోరేజీ పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్ఎండీలో 12 టీఎంసీలకు తక్కువ ఉండకుండా చూడాలంటూ నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తాజా పరిస్థితులను చూస్తే ఈ సారి వేసవిలో నగర వాసులకు నీటి కొరత ఏర్పడే ముప్పు ఉందన్నారు. నగరంలో మహిళలు నీటి కోసం బిందెలతో బయటకు వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సాగునీటి అందించే విషయంలో విఫలమైన ప్రభుత్వం, కనీసం తాగునీటి విషయంలోనైనా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

నగరంలో అభివృద్ధి పనులకు మున్సిపల్ అధికారులెవరూ రావడం లేదని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గంగుల కమలాకర్ చెప్పారు. శానిటేషన్ విభాగంలో పారిశుధ్య కార్మికులు అనారోగ్యం పాలయితే వారికి బదులుగా కుటుంబసభ్యులు కార్మికులుగా పని చేస్తారని, ఇది అందరికి తెలిసిందేనన్నారు. కానీ, ఇప్పుడు వారిని కూడా అధికారులు తొలగించారని, దీనిపై కూడా కలెక్టర్‌ను కలిసి వారిని కొనసాగించాలని డిమాండ్ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ వెంటపడుతామని హెచ్చరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చినప్పుడు తాము సంతోషిస్తామన్నారు. బడ్జెట్‌లో బీసీలకు నిధుల కేటాయింపులో పూర్తిగా వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ఏటా ₹20వేల కోట్లు బడ్జెట్ కేటాయిస్తామని చెప్పిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలుపుకోవడం లేదని ఆగ్రహించారు. బీసీ సమాజం ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ రుద్రరాజు, మాజీ కార్పొరేటర్లు రాజేందర్‌రావు, బండారి వేణు, కంసాల శ్రీనివాస్, ఐలేందర్, మాజీ ఎంపీటీసీ తిరుపతినాయక్, నాయకులు సంపత్‌రావు, గందె మహేశ్, దూలం సంపత్, కోల సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ బిల్లులు ఇవ్వండి

నినదిస్తున్న ఆశ కార్యకర్తలు

కరీంనగర్ విద్యానగర్, మార్చి 20 : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ డీఎంహెచ్‌వో ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లెప్రసీ సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తకు ప్రతి సంవత్సరం ₹1050 చొప్పున ఇవ్వాల్సి ఉందని, 649 ఆశ వర్కర్స్‌కి ₹6,81,450 ఇవ్వాల్సి ఉందన్నారు. ఆశలు ధర్నా వద్దకు వచ్చిన డీఎంహెచ్‌వో వెంకటరమణ మాట్లాడుతూ బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదని, వచ్చిన వెంటనే ఆశల ఖాతాలో జమ చేస్తామన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్ శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీలత పాల్గొన్నారు.

## విజయోస్తు
### నేటి నుంచే టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్

పెద్దపల్లి, మార్చి 20 : పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. శుక్రవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరగనున్నాయి. కరీంనగర్ జిల్లాలో 73 పరీక్ష కేంద్రాల్లో 12,516 మంది, జగిత్యాల జిల్లాలో 67 పరీక్ష కేంద్రాల్లో 11,855 మంది, పెద్దపల్లి జిల్లాలో 41 కేంద్రాల్లో 7,393 మంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 35 పరీక్ష కేంద్రాల్లో 6,768 మంది పరీక్షకు హాజరు కానున్నారు.

## డిగ్రీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, మార్చి 20 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలు వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్ రవి కుమార్, ఓఎస్‌డీ హరికాంత్, డాక్టర్ డీ సురేశ్ కుమార్ గురువారం విడుదల చేశారు. ఈ మేరకు డిసెంబర్ 2024, 2025లో నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్స్ రెగ్యులర్, బ్యాక్లాగ్ పరీక్షల ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ ఫలితాలను యూనివర్సిటీ వెబ్ సైట్ www.satavahana. ac.in లేదా https://sivuresults.azurewe bsites.net లో చూసుకోవాలని సూచించారు. ఇక్కడ అడిషనల్ కంట్రోలర్స్ డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ అబ్రరూల్ బాక్ తెలిపారు.







### ₹2వేల కోట్లు కేటాయించాలి



చేనేత, పవర్‌లూం రంగానికి బడ్జెట్‌లో ₹రెండువేల కోట్లు కేటాయించాలి. ఈ విషయమై మా యూనియన్ ద్వారా పలుసార్లు మంత్రులు, సీఎంకు వినతి పత్రాలు సమర్పించాం. నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగు పరచడం కోసం పథకాలు యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశాం. అయినా సర్కారు నేతన్నలను విస్మరించింది. బడ్జెట్‌లో ₹371కోట్లు మాత్రమే కేటాయించింది. వాటితో యారన్, విద్యుత్ సబ్సిడీలు, పింఛన్లు, చీరల పథకాలు ఎలా కొనసాగిస్తుంది? బడ్జెట్‌లో నేతన్నలకు పూర్తిగా అన్యాయం జరిగింది. ప్రభుత్వం పునరాలోచించాలి.

**- మూషం రమేశ్, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు**

₹371 కోట్లు? ఏ మూలకు?

# నేతన్నకు మొండిచేయి!

## వస్త్ర పరిశ్రమపై చిన్నచూపు.. బడ్జెట్‌లో అంతంతే కేటాయింపు

- చేనేత, మరమగ్గాలకు అరకొర నిధులు • నాడు కేసీఆర్ ప్రభుత్వంలో ₹1200కోట్లు
- నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కేవలం ₹371కోట్లే.. • ఊసేలేని వర్కర్‌టూ ఓనర్ పథకం
- ₹లక్ష రుణమాఫీ ఉత్తదేనా? • కాంగ్రెస్ సర్కారు తీరుపై నేత కార్మికుల అసంతృప్తి
- పవర్‌లూం సంఘాల నాయకుల మండిపాటు

బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న నేతన్నలకు నిరాశే మిగిలింది. ఉపాధి లేక బతుకులు ఆగమైన కార్మికులకు సర్కారు ఆపన్నహస్తం అందిస్తుందనుకుంటే మొండిచేయే ఇచ్చింది. నాడు కేసీఆర్ ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేత, మరమగ్గాలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ₹1200 కోట్లు కేటాయిస్తే.. నేడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ₹371కోట్లే కేటాయించి చిన్నచూపు చూసింది. వ్యవసాయం తర్వాత కీలకమైన వస్త్రపరిశ్రమకు తీవ్ర అన్యాయం చేసింది. ప్రపంచ చరిత్రను తిరగరాస్తూ కార్మికుడిని యజమానిగా మార్చాలంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వర్కర్‌టూ ఓనర్ పథకంపై కనీసం ఊసెత్తలేదు. కార్మికుడికి రూ.లక్ష రుణమాఫీపై స్పష్టత ఇవ్వలేదు. వస్త్ర పరిశ్రమపై కాంగ్రెస్ అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిపై నేతనల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ అరకొర నిధులతో పెద్దగా ప్రయోజనం ఉండదని, అవి ఏ మూలకూ సరిపోవనే అభిప్రాయం వెల్లడవుతున్నది.

రాజన్న సిరిసిల్ల, మార్చి 20 (నమస్తే తెలంగాణ): వ్యవసాయం తర్వాత లక్షలాది మందికి ఉపాధి నిస్తున్నది వస్త్ర పరిశ్రమ. అలాంటి వస్త్ర పరిశ్రమ 2014కి ముందు ఉమ్మడి కాంగ్రెస్ సర్కారు హయాంలో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. వందలాది మంది కార్మికులు ఆకలిచావులు, ఆత్మహత్యలతో ఉరిసిల్లగా మారింది. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత తొలి కేసీఆర్ ప్రభుత్వం అప్పటి మంత్రి కేటీఆర్ చొరవతో పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నది. చేనేత, మరమగ్గాలు వేర్వేరుగా ఉన్న పరిశ్రమలో ఎదురవుతున్న ఇబ్బందులు, నేతన్నల సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో చేనేత, మరమగ్గాలకు వేర్వేరు కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. తెలంగాణ పవర్‌లూం టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ కార్పొరేషన్‌కు సిరిసిల్ల నేత కుటుంబానికి చెందిన గూడూరి ప్రవీణ్‌ను చైర్మన్‌గా నియమించింది. చేనేత, మరమగ్గాల పరిశ్రమ అభివృద్ధితో పాటు నేతన్నల సంక్షేమం కోసం త్రిఫ్ట్, నేతన్నకు బీమా, రూ.లక్ష రుణమాఫీ, యారన్ సబ్సిడీ, పింఛన్లు ఇవ్వడమే కాకుండా ఎనిమిది నెలల పాటు నిరంతరం ఉపాధినిచ్చే బతుకమ్మ చీరలతో వారి బతుకులకు భరోసా కల్పించింది. అందుకోసం ఆనాడు బడ్జెట్‌లో ₹1200 కోట్లు కేటాయించింది. నాటి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన సంక్షేమ పథకాలతో చేనేత, మరమగ్గాల పరిశ్రమ అభివృద్ధి పరుగులు పెట్టింది. కార్మికులకు చేతి నిండా పనితో ఉరిసిల్లను 'సిరి'సిల్లగా మార్చింది.

### నేడు కేవలం ₹371కోట్లే

కేసీఆర్ ప్రభుత్వం నేతన్నను కడుపులో పెట్టుకుని చూసుకున్నది. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారింది. బడ్జెట్‌లో నాడు ₹1200 కోట్లు కేటాయిస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ₹371కోట్లు కేటాయించింది. ప్రతి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెరుగుతూ వస్తుందనుకున్న నేతన్నల ఆశలు ఆవిరయ్యాయి. గత ప్రభుత్వం కన్నా అద్భుతంగా బడ్జెట్ ఉంటుందని భావిస్తే సర్కారు రిక్త హస్తం చూపిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగు పరచడం కోసం పథకాలు యథాతథంగా కొనసాగించాలని కార్మికులు డిమాండ్ చేసిన నేపథ్యంలో బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఎక్కువ ఉండాలి. కానీ, అరకొర నిధులతో పథకాలు అమలు కావడం అనుమానంగానే ఉన్నది. మహిళా సంఘాలకు ఇచ్చే చీరలకు సుమారు ₹500 కోట్లు అవసరం ఉంది. ఇక విద్యుత్ సబ్సిడీకి, వర్కర్‌టూ ఓనర్ పథకం ఇలా అనేక పథకాలు అమలు చేయాలంటే కనీసం ₹2వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంటుంది. ఇంత తక్కువ మొత్తంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ప్రభుత్వం నేతన్నలకు నిరంతర ఉపాధి కల్పిస్తుందా..? వారి బతుకులకు భరోసా నిస్తుందా..? అన్న సందేహాలను కార్మిక కుటుంబాలు వ్యక్తం చేస్తున్నాయి.

### ప్రస్తావన లేని వర్కర్‌టూ పథకం

ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా కార్మికుడు కార్మికుడుగానే మిగిలిపోతున్నాడు. కార్మికుడే యజమాని అయితే వారి బతుకులు బాగుపడుతాయన్న ఉద్దేశ్యంతో నాడు కేసీఆర్ ప్రభుత్వం దాదాపు ₹350కోట్ల వ్యయంతో వర్కర్ టూ ఓనర్ పథకం ప్రవేశపెట్టారు. అందుకు అప్పారెల్ పార్కులో వర్క్‌షెడ్లను నిర్మించారు. మొదటి దశలో 1140 మందికి సబ్సిడీపై వర్క్‌షెడ్లు, సాంచాలు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచింది. వర్కర్‌టూ ఓనర్ పథకాన్ని ప్రారంభించి తమను యజమానులను చేస్తుందన్న నేతన్నల కలలు కల్లలై పోయాయి. ఈ పథకం అమలు చేయాలని కార్మిక సంఘాలు పలుసార్లు మంత్రులు, సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. హామీలే తప్ప అమలు చేసిన పాపాన పోలేదు. ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వర్కర్ టూ ఓనర్ పథకం ఊసెత్తలేదు. అసలే తీవ్ర సంక్షోభంలో సిరిసిల్ల టెక్స్‌టైల్స్ పార్కు కూరుకుపోయింది. అందులోని చాలా యూనిట్లు మూతపడి పోయాయి. కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. సిరిసిల్ల పరిశ్రమ సంక్షోభం కారణంగా ఇప్పటికే చాలా మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోగా, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కనీసం సాయం అందించేవారు లేక ఆగమవుతున్నాయి.

### ₹లక్ష రుణమాఫీ హామీలకే పరిమితం

నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయనుకుంటే.. ప్రస్తుతం చూస్తే ఇంకా దయనీయంగా మారే పరిస్థితి కనిపిస్తున్నది. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మశాలీ జాతీయ సదస్సులో నేతన్నల సమస్యలను నేతలంతా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అప్పుల నుంచి నేతన్నలను విముక్తి చేయాలంటూ మొరపెట్టుకున్నారు. అందుకు స్పందించిన సీఎం ₹లక్ష రుణమాఫీ చేస్తానని హామీలిచ్చారు. ఇచ్చిన హామీనీ బడ్జెట్‌లో ప్రస్తావించక పోవడంపై నేతన్నలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. బయట అప్పులు పుట్టక మైక్రో ఫైనాన్స్‌ల ఉచ్చులో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ హామీ నెరవేరుతుందా.. లేదా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా ఏమైనా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నేత కుటుంబాలు, వస్త్ర పరిశ్రమపై పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి.

### వివక్ష చూపుతున్నది

ప్రభుత్వం ముమ్మాటికీ మోసపూరిత విధానాలు అవలంబిస్తున్నది. కాంగ్రెస్ ఎన్నికల ముందు నేతన్నలకు ఏదో చేస్తామని ఎన్నో హామీలు గుప్పించింది. స్వయం సహాయక మహిళలకు రెండు ఇచ్చే రెండు చీరలు సిరిసిల్లలోనే తయారీ చేసి చేతి నిండా పనికల్పిస్తామని చెప్పింది. కానీ, చీరల తయారీకే ₹500 కోట్లు అయ్యాయి. అలాంటి బడ్జెట్‌లో ₹371కోట్ల కేటాయిస్తే ఏం ప్రయోజనం? సంక్షేమ పథకాలు అమలు ఎలా చేస్తరు? చేనేత పరిశ్రమపై, నేతన్నలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నది. నిధులు కేటాయించిన తీరు నేతన్నలపై పక్షపాతం చూపినట్టు ఉన్నది.



**- పంతం రవి, సీపీఐ పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి (సిరిసిల్ల)**

### మోచేతికి బెల్లం పెట్టిన్రు?



ఏండ్ల సంది సాంచాల మీదనే ఎల్లదీత్తన్నం. పెద్దసారు కేసీఆర్ దయవల్ల బతుకమ్మ చీరలు ఇచ్చి మాకు పని కల్పించిండు. ఒక్కటారెండా.. ఎన్నో పథకాలు పెట్టిండు. యారన్ సబ్సిడీ, పింఛన్లు ఇచ్చిండు. ఆరేడేళ్లు చేతినిండా పనితో నెలకు ₹20వేలు పగారచ్చేలా చేసిండు. భార్యా పిల్లలతో ఉన్న ఊళ్లో బతికినోళ్లం. కాంగ్రెస్ అచ్చినంక గింత పనైతదనుకోలేదు. బడ్జెట్‌లో ఏదో మాకు మేలైతదని ఆశపడ్డం. కానీ, మోచేతికి బెల్లం పెట్టిన్రు? అంతే తప్ప పెద్దగా చేసిందేమీ లేదు.

**- గెరిట్యాల విజయ్, నేత కార్మికుడు**

### వస్త్ర పరిశ్రమకు ఒరిగేదేమీ లేదు



వ్యవసాయం తర్వాత లక్షల మందికి జీవోనోపాధి కల్పించేది వస్త్ర పరిశ్రమ. అలాంటి పరిశ్రమకు ₹371కోట్లు కేటాయించడం అన్యాయం. కొద్ది నిధుల వల్ల పరిశ్రమకు ఒరిగేదేమీ లేదు. ప్రభుత్వం నేతన్నలను చిన్నచూపు చూసింది. నేతన్నలకు రుణమాఫీ, విద్యార్థులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, తులం బంగారం, ఆటో డ్రైవర్లకు భృతి ఏమైంది? నేతన్నలకు ఉపాధి కల్పించి, వస్త్ర పరిశ్రమను ఆదుకోవాల్సిన బాధ్యత సర్కారుదే.

**- అల్లాడి రమేశ్, సెస్ మాజీ చైర్మన్**

# రైతుల గోస పట్టదా..?

- పంటలు ఎండుతున్నా కనిపించడం లేదా • చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ • మల్లన్నపల్లిలో ఎండిన పంటల పరిశీలన • ఎకరాకు ₹25 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

చొప్పదండి, మార్చి 20 : 'పొలాలకు నీళ్లు లేక.. కరెంట్ రాక పంటలు ఎండుతున్నా కనిపించడం లేదా..? రైతులు గోస పడుతున్నా సీఎం రేవంత్‌రెడ్డికి పట్టదా?' అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. గురువారం చొప్పదండి మండలం మల్లన్నపల్లిలో ఎండిన పొలాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ పంటల పరిస్థితులను వివరించారు. రైతు బండారు స్వామి మాట్లాడుతూ నీళ్లు లేక పొట్టకొచ్చిన ఎకరంన్నర పొలం ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ₹20 వేలు ఖర్చుపెట్టి బావిలో పూడిక తీసినా నీళ్లు రావడం లేదని వాపోయాడు. అనంతరం సుంకె రవిశంకర్ మాట్లాడుతూ, నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నదని విమర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో రైతులు అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కెనాల్‌లో 24 గంటలు నీళ్లు, కరెంట్ ఉండేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక వారబంధీ పద్ధతిన అది కూడా పది రోజులకు ఒకసారి కెనాల్‌కు నీరు విడుదల చేస్తున్నారని, దానివల్ల అవి చివరి ఆయకట్టుకు అందడం లేదని వాపోయారు. పదెకరాలు ఉంటే సగం ఎండిపోతున్నదని తెలిపారు. ఎండిన పంటలకు ఎకరాకు ₹25 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మినుపాల తిరుపతిరావు, మాచర్ల వినయ్, చీకట్ల రాజశేఖర్, గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గాండ్ల లక్ష్మణ్, వడ్లూరి భూమయ్య, జహీర్, బీసవేణి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పొలాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

### ఆరు లక్షలు పెట్టి తవ్వినా నీళ్లు లేవు



నాకు మూడెకరాల పొలం ఉన్నది. ఇప్పుడు రెండెకరాలు ఎండిపోయింది. రూ. ఆరు లక్షలు ఖర్చుపెట్టి బావి తవ్వించిన. అయినా నీళ్లు ఎల్లకపోవడంతో ఐదు సైడ్ బోర్లు వేయించిన. బావిల నీళ్లు పంటకు సరిపడా వెళ్తలేవు. కరెంట్ గడిగడికి పోవడంవల్ల ఉన్న నీళ్లు కూడా సక్కగ పారుతలేవు. మడి మడికి పైపు లైను వేసి నీళ్లు పెడుతున్న. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు 24 గంటల కరెంట్ పుష్కలంగా నీళ్లు వచ్చేవి. పంటలు బాగా పండించుకున్నం. అప్పుడు కెనాల్‌ల నీళ్లు ఉండడం వల్ల బావిల ఊట వచ్చి ఫుల్లు నీళ్లు ఉండేవి. ఇప్పుడు కెనాల నీళ్లు లేక భూగర్భ జలాలు ఇంకి పోయినయ్. పంటలు ఎండిపోయిన రైతులను సర్కారు ఆదుకోవాలె.

**-బండారు తిరుపతి, మల్లన్నపల్లె**

### ఎప్పుడూ ఇసొంటి పరిస్థితి రాలే..



నేను ఎకరంన్నర వరి వేస్తే నీళ్లు లేక ఎండిపోయింది. పొట్ట కొచ్చినంక ఎండిపోతున్నదని ₹20 వేలు ఖర్చుపెట్టి బావి పూడిక తీసిన. అయినా నీళ్లు రాలే. బావిల నీళ్లు అడుగంటినయ్. కరెంట్ సమస్యతో సతమతమవుతున్నం. ₹50 వేల దాకా పెట్టుబడి పెట్టిన. పొలం మొత్తం ఎండిపోయింది. కేసీఆర్ సారు ఉన్నప్పుడు పదేండ్ల బీఆర్ఎస్ పాలనల ఎప్పుడూ ఇంతటి పరిస్థితి రాలే. కాంగ్రెస్ సర్కార్ రైతులను మస్తు తిప్పలు పెడుతంది.

**- బండారు స్వామి, మల్లన్నపల్లె**